నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, గురువారం 25 ఏప్రిల్ 2024 | NAGARKURNOOL

బీజేపీకి కాంగ్రెస్ మద్దతు

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యేలు

- అసెంబ్లీ ఎన్నికల్లోనే పొత్తు తేలిపోయింది
- ఇరు పార్టీలది లోపాయికారి ఒప్పందం
- రెండు ఒకటేనన్న చర్చకు సిద్ధమా..?
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మోసపూరిత పార్టీలను నమ్మొద్దు
- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీజేపీకి కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నదని, రెండు పార్టీల పొత్తు అసెంబ్లీ ఎన్నికల్లోనే తేలిపోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించడమే ధ్యేయంగా రెండు పార్టీలు ఏకమయ్యాయని ఆరోపించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాకు మద్దతు తెలపండి.. పార్లమెంట్ ఎన్నికల్లో మీకు మద్దతిస్తామని కమలం, హస్తం పార్టీలు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన జితేందర్‌రెడ్డి వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్‌ను అధికారంలో రాకుండా అడ్డుకునేందుకు ఇలాంటి అపవిత్ర పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. పైకి ఈ రెండు పార్టీలు సెపరేట్ అనేలా వ్యవహరిస్తున్నా నిజం మాత్రం ఇదేనన్నారు. తెలంగాణలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలన్నింటినీ గుప్పించిందని, అధికారంలోకి వచ్చాక మాత్రం ఒక్క గ్యారెంటీ కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. రేవంత్ ఇచ్చిన హామీల మేరకు రైతు భరోసా పేరుతో రైతులకు ఎకరా కు రూ.15 వేలు ఇచ్చి ఉంటే కాంగ్రెస్‌కు ఓటేయండి.. లేదంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయండి.. పింఛన్లు రూ.4వేలు అందించి ఉంటే హస్తం పార్టీకి ఓటేయండి.. లేదంటే గులాబీ పార్టీని ఆదరించండి.. కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతోపాటు తులం బంగారం అందించి ఉంటే రేవంత్‌రెడ్డి పార్టీకి ఓటేయండి.. ఇవ్వకుంటే కేసీఆర్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ టూర్‌ను సక్సెస్ చేయాలి

పాలమూరు జిల్లాలో పర్యటించనున్న గులాబీ బాస్ కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ప్రతి నియోజకవర్గం నుంచి 15 వేల మందిని సమీకరించనున్నట్లు తెలిపారు. జడ్చర్ల నుంచి మొదలయ్యే ర్యాలీ అప్పన్నపల్లి, ఏనుగొండ, శ్రీనివాసకాలనీ, పద్మావతి కాలనీ, బస్టాండ్ మీదుగా క్లాక్ టవర్‌కు చేరుకుంటుందన్నారు. అక్కడ నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో గులాబీ బాస్ ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం రాత్రికి జిల్లా కేంద్రంలోనే బస చేస్తారన్నారు. అధినేతకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కరెంట్ కోతలతో సతమతం : లక్ష్మారెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కరెంట్ కోతలు పెరిగాయని, రైతులతోపాటు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. అధికారంలోకి వస్తామని ముందుగానే ఊహించి ఉంటే కాంగ్రెస్ హామీలు ఇచ్చేది కాదేమో అన్నారు. ఎందుకంటే చెప్పిన గ్యారెంటీలు అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పటివరకు చేయలేదని ధ్వజమెత్తారు. తాజాగా మళ్లీ ఆగస్టు 15 తర్వాత అంటూ మాట మారుస్తున్నారని విమర్శించారు. రేవంత్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. పింఛన్ రాకపోతే కేసీఆర్ గుర్తొస్తున్నాడని, రైతుబంధు ఇవ్వకపోతే కేసీఆర్ గుర్తొస్తున్నాడని అన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించాలి..

స్థానిక అభ్యర్థి అయిన తనను మరోసారి ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే స్థానిక సమస్యలపై వాణి వినిపిస్తానని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా.. ఏ ఆపద వచ్చినా మీ ముందుకు వచ్చి తీరుతా అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే ఒకరు గద్వాలకు పరిమితం అవుతారని, మరొకరు రాహుల్‌గాంధీ వెంట ఉంటారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం నల్లధనాన్ని తీసుకొచ్చి పేదల ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. అలాగే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో జనాన్ని బురిడీ కొట్టించిందన్నారు. వారు చెప్పిన పథకాలు ఏవీ అమలు కావడం లేదన్నారు. అధికార దాహం కోసమే లేనిపోని ఆశలు చూపుతున్నారని విమర్శించారు. ఓటేసే ముందు కేసీఆర్ ప్రభుత్వం చేసిన మంచి పనులను గుర్తుంచుకొని ఆలోచించి వేయాలని సూచించారు.

మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

రేవంత్‌ను నిలదీయాలి

- హస్తం పార్టీ, బీజేపీ ఒక గూటి పక్షులే..
- రైతుబంధే ఇవ్వలే.. రుణమాఫీ చేస్తారా..?
- ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా..
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, ఏప్రిల్ 24 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలందరినీ దగా చేసిన కాంగ్రెస్ పార్టీని అడుగడుగునా నిలదీయాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాల్లోని చింతలపల్లి, చుక్కాపూర్, ఖానాపూర్, వెంకట్రావ్‌పేట్, గట్టిప్పలపల్లి, మెదక్‌పల్లి, రాంపూర్, చంద్రధన, తలకొండపల్లి, పడకల్, రావిచేడ్, మక్తమాదారం, మైసిగండి, కర్కల్‌పహాడ్, ఎక్వాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి ఆర్ఎస్‌పీ పాల్గొన్నారు. ముందుగా ఆమనగల్లు పట్టణంలోని సంత్ సేవాలాల్ గుట్ట వద్ద సేవాలాల్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైతుబంధు ఇవ్వలేక బొక్కబోర్ల పడ్డ సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్టు వేసి ప్రజలను మరోసారి వంచిస్తున్నాడని దుయ్యబట్టారు. తాను 26 సంవత్సరాల ఉన్నత స్థాయి పోలీస్ ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. రాజకీయ హోదా, అధికారం కోసం, అక్రమ సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రజల గొంతుకగా సమస్యలను పార్లమెంట్‌లో వినిపించడానికే ఎన్నికల్లో నిల్చున్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పనిచేసి వేల మంది విద్యార్థుల ఉన్నత చదువులకు శ్రీకారం చుట్టి ఎంతో మంది బడుగు బలహీన వర్గాల పిల్లల ను ఉన్నతస్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దానని చెప్పారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ఉచితవిద్య, వైద్యం ఎంతో అవసరమని దాని కోసం సీఎం కేసీఆర్ ఎంతో పరితపించి సాధ్యమైనంత వరకు అమలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. నాపై నమ్మకముంచి పార్లమెంట్‌లో మీ తరపున ప్రశ్నించే అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ప్రధాని మోదీ, అమిత్‌షా లాంటి అగ్రనాయకులు మాట్లాడుతూ బీజేపీకి 400 పార్లమెంట్ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బహిరంగానే చెబుతున్నారని, అలా చేస్తే మన పిల్లలకు రిజర్వేషన్లు, ఉద్యోగాలు రావని.. ఫలితంగా రోడ్ల మీద బిచ్చమెత్తుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని బడేబాయ్–చోటేబాయి అనుకుంటున్నారని, ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ది అప్రజాస్వామిక పాలన : జైపాల్

కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తి వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ దీవించి పంపిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి ఉన్నత విద్యావంతుడికి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆగమాగం చేసిన తెలంగాణ రాష్ట్రానికి పూర్వవైభవం, పునర్నిర్మాణం జరగాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలంటే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి ప్రశ్నించే గొంతుక పార్లమెంట్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీటీసీలు నేనావత్ అనురాధ, దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, వైస్‌ఎంపీపీలు ఆనంద్, శంకర్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎల్ఎన్ రెడ్డి, ఎంపీటీసీలు కుమార్, వెంకటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అర్జున్‌రావు, ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, శంకర్, విజయ్‌గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యా నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జోగు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ విద్యార్థికి స్టేట్ ఫస్ట్ మార్క్

రాష్ట్రస్థాయిలో మొదటి మార్క్ సాధించిన ప్రతిభ కళాశాల విద్యార్థిని అభినందిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

పాలమూరు, ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో మహబూబ్‌నగర్‌లోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థి ఏ శివశంకర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గానూ 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ మార్క్ సాధించాడు. రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారి మహబూబ్‌నగర్ ప్రతిభ కళాశాల విద్యార్థి ప్రథమ మార్క్ సాధించి చరిత్రలో నిలిచాడు. అదేవిధంగా ఎస్. హన్సిక 468/470, కె.యశ్వంత్‌రెడ్డి 468/470, వై.రమేశ్ 468/470 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఎం.శ్రావ్య 437/440, పి.మంజు 436/440, బైన్‌బిన్ మహ్మద్436/440, సీహెచ్ కిరణ్ 436/440 మార్కులను సాధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో బి.సాత్విక 992/1000, కె.కావ్య 991/1000, ఎస్.లక్ష్మీప్రవళిక 990/1000 మార్కులను సాధించారు. బైపీసీ విభాగంలో ఆర్ చంద్రిక 988/1000, జి.సౌందర్య 986/1000 మార్కులను సాధించారు. ఎంపీసీ ఫస్టియర్‌లో 400కుపైగా 381మంది, బైపీసీలో 400కు పైగా 71 మంది, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 900కుపైగా 368మంది, బైపీసీలో 900కుపైగా 67మంది విద్యార్థులు అత్యధిక మార్కులను సాధించారు. బుధవారం రాష్ట్ర స్థాయి ప్రథమ మార్క్ సాధించిన విద్యార్థిని డీఐఈవో డాక్టర్ శ్రీధర్‌సుమన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఫలితాలకు అహర్నిశలు కృషి చేసిన అధ్యాపకులు, సహకరించిన తల్లిదండ్రులు, కళాశాల సలహాదారులు కే.మంజులాదేవి, వీ.లక్ష్మారెడ్డి, కే.విష్ణువర్ధన్‌రెడ్డి, కే.జనార్దన్‌రెడ్డి, జీ.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లకు అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో వాగ్దేవి ప్రభంజనం

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈవో

పాలమూరు, ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు చరిత్ర సృష్టించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో మునావర్ ఫాతిమా 992/1000మార్కులు, ఎంపీసీ విభాగంలో సోనియా 990/1000 మార్కులు సాధించారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో సపూరా 438/440 రాష్ట్రస్థాయి ప్రథమ మార్కులు, ఎంపీసీ విభాగంలో రేవంత్‌రెడ్డి 466 /470 మార్కులు, ముజామిల్ 466/470, ఇర్ఫాన్ 465/470, నవనీత్‌కుమార్‌గౌడ్ 465/470 మార్కులు సాధించారు. వీరిని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్‌సుమన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఇదే ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదువుతూ జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో చాటాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి కేవలం మనిషికి మాత్రమే ఉంటుందని జీవితంలో ఒక సక్సెస్‌ఫుల్ పర్సన్‌గా మారడానికి ఇటువంటి విజయాలు ఎంతో దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ కార్యాలయ సూపరింటెండెంట్ సందీప్‌రెడ్డి, సిబ్బంది సాధిక్, అలీ, ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదకొండు నామినేషన్లు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం కొనసాగుతున్నది. బుధవారం మహబూబ్‌నగర్ నుంచి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి నాలుగు నామినేషన్లు రిటర్నింగ్ అధికారికి అందాయి. మహబూబ్‌నగర్‌లో గురువారం ఎంపీ మన్నె నామినేషన్ వేయనున్నారు.